సాక్షి పల్నాడు

శనివారం । 24 । ఆగస్టు । 2024




శ్రావణమాస పూజలు

దాచేపల్లి: శ్రావణమాసం సందర్భంగా శుక్రవారం వాసవీ కన్యకా పరమేశ్వరి, వీర్ల అంకమ్మ తల్లి ఆలయాలలో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. కుంకుమ పూజలు చేశారు.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు జలాశయం శుక్రవారం సాయంత్రానికి 45.4620 టీఎంసీలకు చేరింది. దిగువకు ఒక గేటు ద్వారా 12620 క్యూసెక్కులు వదలుతున్నారు.



సాగర్ నీటిమట్టం


విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 589.10 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 8,221 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



కఠిన చట్టాలు తేవాలి...

వైద్యులకు నానాటికీ రక్షణ లేకుండా పోతోంది. ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న భయంతో పనిచేయాల్సి వస్తోంది. వైద్యులకు రక్షణ కల్పించేలా ప్రభుత్వాలు నూతన చట్టాలను తీసుకురావాలి. రోగి బంధువులు, అనుమానిత వ్యక్తులు పెద్ద సంఖ్యలో వచ్చినప్పుడు విధులు నిర్వహించడానికి ఆందోళనకరంగా ఉంటుంది. అవసరమైన భద్రత అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉండాలి. వైద్యుల సేవలను గుర్తించి వారిని స్వేచ్ఛగా పనిచేసుకునే వాతావరణం కల్పించాలి.

-డాక్టర్ హసీనా, ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం, గురజాల



శిక్ష పడాల్సిందే...

కోల్‌కతా ఘటనకు కారణమైన దుర్మార్గులకు చట్టం ప్రకారం కఠినమైన శిక్ష పడాలి. అప్పుడే బాధిత మహిళ ఆత్మ శాంతిస్తుంది. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కావు. వైద్యులపై జరుగుతున్న అమానుష దాడుల దర్యాప్తులో రాజకీయ జోక్యం లేకుండా ఉండాలి. రాజకీయనాయకులు బాధిత మహిళా వైద్య సిబ్బందికి అండగా నిలవాల్సిన సమయమిది. అప్పుడే న్యాయం జరుగుతుంది.

- బండారు జమ, హెడ్ నర్స్, ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం, గురజాల



న్యూస్‌రీల్

ఆంధ్రకేసరికి ఘన నివాళులు



నరసరావుపేట: జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, బీసీ వెల్ఫేర్ సంయుక్తంగా జిల్లా కలెక్టర్ ఆఫీసులో శుక్రవారం స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్ర కేసరి, ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఆర్వో కె.వినాయకం పాల్గొని టంగుటూరి చిత్రపటానికి పూలమాలలతో ఘన నివాళులర్పించారు. బీసీ వెల్ఫేర్ అధికారి శివ నాగేశ్వరరావు, జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి జి.సురేష్, బాస్కెట్‌బాల్ కోచ్ సీహెచ్.శ్రీనివాసరావు, అథ్లెటిక్స్ కోచ్ ఎం.సైదారావు, సిబ్బంది, క్రీడాకారులు పాల్గొని విజయవంతం చేశారు.

పంచాయతీ వ్యవస్థకు మేలు



అద్దంకి రూరల్: కూటమి ప్రభుత్వంతో పంచాయతీ వ్యవస్థకు పూర్వ వైభవం వస్తుందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. శుక్రవారం సంతమాగులూరు మండలంలోని మక్కెనవారిపాలెం గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ.. రెండు నెలల్లోనే సీఎం చంద్రబాబు 15వ ఆర్థిక సంఘ నిధుల నుంచి రూ. 990 కోట్లు, జల్‌జీవన్ మిషన్ కింద రాష్ట్ర వాటాగా రూ. 500 కోట్లు గ్రామ పంచాయతీల ఖాతాల్లో జమ చేశారన్నారు. ఐదేళ్ల పరిపాలనలో గత ప్రభుత్వం గ్రామాభివృద్ధికి ద్రోహం చేసిందని విమర్శించారు. కూటమి పాలనలోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు, అధికారులు పాల్గొన్నారు.

ఎరువుల తూకాల్లో తేడాలొస్తే కఠిన చర్యలు



చీరాల టౌన్: ఎరువుల తూకాల్లో తేడాలొస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ కంట్రోలర్ బిజాక్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన చీరాలలోని పలు దుకాణాలను పరిశీలించారు. నాలుగు చోట్ల 50 కేజీలు ఉండాల్సిన బస్తా బరువు 48.50 కేజీలు ఉండటంపై కేసులు నమోదు చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఎరువులు విక్రయించినప్పుడు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కంట్రోలర్ లిల్లీ, ఇన్స్పెక్టర్లు నాగేశ్వరరావు, రామ్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

యార్డులో 46,598 బస్తాల మిర్చి విక్రయం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 41,874 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 46,598 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల సగటు ధర రూ.7,500 నుంచి రూ. 17,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.7,500 నుంచి 18,700 వరకు లభించింది. ఏసీ కామన్ రకం రూ. 9,000 నుంచి రూ. 15,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 8,500 నుంచి రూ. 18,800 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.12,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 14,813 బస్తాల నిల్వ ఉన్నట్లు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వర రెడ్డి తెలిపారు.

మెట్లు ఎక్కేదెలా!

ఆనందం...ఆవేదన

- మొదటి అంతస్తులో రక్త, మూత్ర పరీక్షలు
- మెట్లు ఎక్కలేక గర్భిణుల అవస్థలు
- గ్రౌండ్ ఫ్లోర్‌కు మార్చే అవకాశం ఉన్నా పట్టించుకోని అధికారులు
- నరసరావుపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఇదీ దుస్థితి

తల్లిని కాబోతున్నాననే ఆనందం కన్నా రక్త పరీక్షల కోసం ఆస్పత్రి మెట్లు ఎక్కలేక గర్భిణులు పడుతున్న వేదన వర్ణణాతీతం. కడుపులో బిడ్డ బరువును మోస్తూ 30 మెట్లు ఎక్కేసరికి చెమటలు కక్కుతున్నారు. సేద తీరుదామంటే సరైన వసతి లేదు..తాగేందుకు నీరు లేక ఇబ్బందులు పడుతున్నారు. వీరి బాధ ఎవరికీ పట్టడం లేదు. పరీక్ష కేంద్రాలను కింది ఫ్లోర్‌లోకి మార్చే అవకాశం ఉన్నా పట్టించుకోవడం లేదు. ఇదీ నరసరావుపేట ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో గర్భిణులు పడుతున్న అవస్థ.



నరసరావుపేట ప్రభుత్వ ఏరియా వైద్యశాల రక్త పరీక్ష కేంద్రం వద్ద వేచి ఉన్న గర్భిణులు

నరసరావుపేట టౌన్: నరసరావుపేట పల్నాడు బస్టాండ్ సెంటర్‌లోని ప్రభుత్వ వైద్యశాల ఆధునీకరణలో భాగంగా లింగంగుంట్లలో 200 పడకలతో నూతన భవనం నిర్మించారు. పాత భవనంలోని పలు విభాగాలను నూతన భవనంలోకి తరలించారు. గైనకాలజీ విభాగం మాత్రం పాత ప్రభుత్వ వైద్యశాలలోనే కొనసాగిస్తున్నారు. గర్భిణులకు ప్రతి నెలా వైద్య సేవలలో భాగంగా రక్త పరీక్షలు తప్పనిసరి. నిత్యం సుమారు 300 మంది గర్భిణులు సుదూర ప్రాంతాల నుంచి పాత ప్రభుత్వ వైద్యశాలకు వస్తుంటారు. అందులో 100 నుంచి 150 మంది వరకు ప్రతి రోజూ రక్త పరీక్షలు అవసరమవుతున్నాయి. సోమ, శుక్రవారాల్లో 200పై చిలుకు గర్భిణులు రక్త పరీక్షల కోసం వస్తుంటారు. రక్త, మూత్ర పరీక్షల విభాగం మొదటి అంతస్తులో కొనసాగుతోంది. దీంతో వీరు ప్రతిరోజూ మెట్లు ఎక్కి మొదటి అంతస్తుకి వెళ్లి పరీక్షలు చేయించుకోవాల్సి వస్తుంది. ఈ కారణంతో గర్భిణులు, బాలింతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నెలలు నిండిన గర్భిణులు మరొకరి సాయం లేనిదే పైఅంతస్తులోకి వెళ్లలేని దుస్థితి నెలకొంది. ఒక్కో మెట్టు ఎక్కుతూ ఆయాసంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఒక్కొక్కసారి రక్త పరీక్షల కోసం అధిక సంఖ్యలో రోగులు వస్తుండడంతో గంటలకు గంటలు నిరీక్షించాల్సి వస్తుంది. కూర్చునేందుకు సరిపడా కుర్చీలు కూడా లేకపోవడంతో సొమ్మసిల్లుతున్నారు. దీనికి తోడు దాహం తీర్చుకునేందుకు తాగునీరు అందుబాటులో లేవు. సమస్యలతో సతమతమవుతున్నా మా బాధ వినే నాథుడే లేడని గర్భిణులు వాపోతున్నారు.

అరకొర సౌకర్యాలు

ఏపీ వైద్యవిధాన పరిషత్ ఆధ్వర్యంలో ఏరియా వైద్యశాలలో నిర్వహిస్తున్న రక్త, మూత్ర పరీక్షల కేంద్రంలో కనీసం సౌకర్యాలు లేక గర్భిణులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. పరీక్షల కోసం ప్రతి రోజూ సుమారు 150 మంది వస్తుండగా అక్కడ వైద్య సిబ్బంది ఒక ల్యాబ్ టెక్నీషియన్, ఓ సహాయకుడు మాత్రమే విధుల్లో ఉంటున్నారు. వస్తున్న రోగులకు సరిపడా సిబ్బందిని పెంచాల్సి ఉన్నా ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. దీంతో గంటల కొద్దీ గర్భిణులు వేచి ఉండాల్సి వస్తోంది. పరీక్షల కోసం గంట సమయం పడుతుండగా, రిపోర్టులు చేతికి అందడానికి అదనంగా కనీసం మరో గంట సమయం పడుతోంది. సుదూర ప్రాంతాల నుంచి వైద్యశాలకు వచ్చేవారు ఒకపూట సమయం వృథా అవుతోందని వాపోతున్నారు. దీనికి తోడు క్యూలైన్ల వద్ద సరిపడా కుర్చీ, బల్లలు అందుబాటులో లేవు. కేవలం 15 మంది మాత్రమే కూర్చోవడానికి వీలుంది. మిగిలిన వారు క్యూలైన్‌లో గంటల కొద్దీ నిలబడి సొమ్మసిల్లిపడిపోతున్నారు. తాగునీరు కూడా అందుబాటులో లేక గర్భిణులు గంటల కొద్ది క్యూలైన్లలో నిలబడి నీరసించిపోతున్నారు. తరచూ విద్యుత్ అంతరాయం కలుగుతుండటంతో ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు.

ప్రత్యామ్నాయం ఉన్నా..

ఏరియా వైద్యశాలలోని ప్రధాన విభాగాలన్నీ లింగంగుంట్ల నూతన ఆసుపత్రికి తరలివెళ్లగా పాత వైద్యశాలలో పలు విభాగాలు ఖాళీగా ఉన్నాయి. జిల్లా డీఎంహెచ్ఓ కార్యాలయం, జిల్లా ఇమ్యూనైజేషన్ కార్యాలయం, జిల్లా లెప్రసీ కార్యాలయాలు ఇక్కడ కొనసాగుతుండగా, అత్యవసర విభాగం, ఆర్ఎంఓ క్వార్టర్స్, ఎమర్జెన్సీ వార్డులు ఖాళీగా ఉన్నాయి. వాటిని అధికారులు స్టోర్ రూంలుగా వినియోగిస్తున్నారు. స్టోర్ రూంలను మరో ప్రాంతానికి తరలించి ఆ గదుల్లో రక్త పరీక్ష కేంద్రాలకు కేటాయిస్తే గర్భిణులకు బాధలు తప్పుతాయి. అయితే సమస్య దీర్ఘకాలికంగా ఉన్నా పరిష్కారానికి అధికారులు చొరవ చూపడంలేదు.



గ్రౌండ్ ఫ్లోర్‌లోని ఎమర్జెన్సీ విభాగం గదిని స్టోర్ రూంగా ఉపయోగిస్తున్న దృశ్యం

విచారించి చర్యలు తీసుకుంటా...



గర్భిణులు రక్త పరీక్షల కోసం పడుతున్న ఇబ్బందులు నా దృష్టికి వచ్చాయి. ఎన్నో ఏళ్లుగా పైఅంతస్తులోనే రక్త పరీక్షల కేంద్రం కొనసాగుతోంది. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తా.

-డాక్టర్ మంత్రూ నాయక్, సూపరింటెండెంట్, ఏరియా వైద్యశాల



నరసరావుపేట ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో మెట్లు ఎక్కలేక ఇబ్బందిపడుతున్న గర్భిణి

మెట్లు ఎక్కలేకపోతున్నాం..



నెల నెలా వైద్య పరీక్షలకు వచ్చినప్పుడు రక్త పరీక్షల కోసం మెట్లు ఎక్కాల్సి వస్తోంది. దీంతో నీరసం, ఆయాసం వస్తున్నాయి. ఒక్కోసారి కళ్లు తిరిగి ఎక్కడపడితే అక్కడ కూర్చోవాల్సి వస్తోంది. కనీసం తాగేందుకు తాగునీరు కూడా అందుబాటులో లేదు. దానికి తోడు ఫ్యాన్లు లేకపోవడంతో తీవ్ర ఉక్కపోతతో అల్లాడిపోతున్నాం.

-వెంకట లక్ష్మి, పమిడిపాడు, నరసరావుపేట మండలం

గంటల కొద్దీ వేచి ఉండాలి



రక్త పరీక్షల కేంద్రం వద్ద గంటల కొద్దీ వేచి ఉండాల్సి వస్తోంది. ప్రతి రోజూ వందల మంది వస్తుంటే కూర్చునేందుకు మూడు బెంచీలు మాత్రమే ఏర్పాటు చేశారు. వీటిపై 15 మంది మాత్రమే కూర్చునే అవకాశం ఉంది. మిగిలిన వారు గంటల కొద్దీ నిలువ కాళ్లపై నిలవాల్సిందే. దీనికి తోడు క్యూలైన్ పక్కన మరుగుదొడ్లు ఉండటంతో దుర్గంధం వెదజల్లుతుంటాయి. మెట్లు ఎక్కే దుస్థితి లేకుండా కింద గదుల్లో రక్త పరీక్షల కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే సౌకర్యంగా ఉంటుంది.

-కందుల రమాదేవి, రూపెనగుంట్ల, నకరికల్లు మండలం

ఇసుక విక్రయాలు పారదర్శకంగా ఉండాలి

జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్



మాదిపాడులో అధికారుల నుంచి వివరాలు సేకరిస్తున్న జేసీ సూరజ్ ధనుంజయ్

అచ్చంపేట: ఇసుక విక్రయాలు పారదర్శకంగా ఉండాలని, అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని జిల్లా జాయింట్ కలెక్టర్ జి.సూరజ్ ధనుంజయ్ అన్నారు. మండలంలోని మాదిపాడు వద్ద నిల్వ ఉంచిన ఇసుక పాయింట్‌ను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. తహసీల్దారు, మైనింగ్ అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ త్వరలో మండలంలోని అన్ని రీచ్‌లను ప్రారంభిస్తామన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున ఇసుక లారీలు స్టాక్ పాయింట్ వద్దకు వెళ్ల లేకపోతున్నాయని, రోడ్డును పునరుద్ధరించేందుకు చర్యలు చేపడతామన్నారు. ప్రస్తుతం మాదిపాడు స్టాక్ పాయింట్‌లో 30 వేల క్యూసెక్కుల ఇసుక నిల్వ ఉందన్నారు. ప్రభుత్వ కాంట్రాక్టు పనులకు ఇసుక కోసం దరఖాస్తులు వస్తున్నాయని వాటిని పరిశీలించాల్సి ఉందన్నారు. ప్రభుత్వ నిర్ణయించిన ధరలకు మాత్రమే ఇసుక విక్రయించాలే తప్ప అధికంగా విక్రయించడం, లారీలకు ఓవర్ లోడ్ చేయడం నేరమన్నారు. స్టాక్ పాయింట్ వద్దకు లారీలను వరుస క్రమంలోనే లోడ్ చేయవలసి ఉంటుందన్నారు. ఎలాంటి ఒత్తిళ్లకు లొంగాల్సిన అవసరం లేదన్నారు. ప్రస్తుతం మండలంలో ఇసుక రీచ్‌లన్నింటిని నిలపివేయడం జరిగిందని, త్వరలో ప్రారంభించి వినియోగదారులకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. సత్తెనపల్లి ఆర్డీఓ మురళి, మైనింగ్ ఏడీ నాగిని, తహసీల్దారు జి.శ్రీనివాసయాదవ్, డిప్యూటీ తహసీల్దార్ జానీబాషా పాల్గొన్నారు.

నేడు ఎస్సీ, ఎస్టీల కోసం ప్రత్యేక పరిష్కార వేదిక

నరసరావుపేట: కలెక్టరేట్‌లో శనివారం ఉదయం 10 గంటల నుంచి ఎస్సీ, ఎస్టీల కోసం ప్రత్యేక ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పి.అరుణ్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. షెడ్యూలు కులాలు, తెగల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆర్టీసీ అభివృద్ధికి కృషి

రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్



బస్సు సర్వీసులను ప్రారంభిస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె రూరల్: ఆర్టీసీ అభివృద్ధికి కృషి చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్‌ల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. రేపల్లె ఆర్టీసీ డిపోకి నూతనంగా వచ్చిన ఇంద్ర డీలక్స్ బస్సులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు ఆర్టీసీ చేరుస్తోందన్నారు. ఆ నమ్మకాన్ని పెంచేలా సంస్థ అభివృద్ధికి సిబ్బంది కృషి చేయాలని సూచించారు. గత ప్రభుత్వం ఆర్టీసీని నిర్వీర్యం చేసిందన్నారు. గాడిలో పెట్టటంతోపాటు లాభాల బాటపట్టేలా ముఖ్యమంత్రి చంద్రబాబు సంస్కరణలు దోహదపడతాయన్నారు. సూపర్ సిక్స్‌లో ఇచ్చిన హామీలలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అతి త్వరలో అమలయ్యేలా కృషి చేస్తామన్నారు. బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఆర్డీవో హెలా షారోన్, డిపో ఇన్‌చార్జి మేనేజర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం విగ్రహావిష్కరణ

రేపల్లె పట్టణంలోని చిన్నమసీదు సెంటరులో ఏర్పాటు చేసిన మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహాన్ని బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్‌తో కలిసి మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆవిష్కరించారు. దేశ అభివృద్ధికి కలాం చేసిన సేవలను కొనియాడారు.

మల్లెపూల అలంకారంలో భ్రమరాంబ దర్శనం

పెదకాకాని: శ్రావణ మాసం మూడో శుక్రవారం పెదకాకాని శివాలయంలో భ్రమరాంబ అమ్మవారిని మల్లెపూలతో అలంకరించారు. శ్రీ మల్లేశ్వర స్వామికి అర్చకులు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, శ్రీ భ్రమరాంబ అమ్మవారికి లక్ష మల్లెపూలతో ప్రత్యేక పూజ, హోమాలు నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామివార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తెనాలి పట్టణానికి చెందిన రెడ్డి నవీన్‌కుమార్, విజయలక్ష్మి దంపతులు, నేలవెల్లి కోటేశ్వరి కుటుంబ సభ్యుల సహకారంతో అమ్మవారికి ప్రత్యేక పూల అలంకరణ చేసినట్లు ఆలయ ఉప కమిషనర్ డి. శ్రీరామవరప్రసాదరావు తెలిపారు. నాలుగో శుక్రవారం గాజుల అలంకారంలో భక్తులకు అమ్మవారు దర్శనమిస్తుందని పేర్కొన్నారు. అదేరోజు ఉచిత సామూహిక శ్రావణ మాస వరలక్ష్మి వ్రతాలు, శ్రీ భ్రమరాంబ అమ్మవారిని లక్ష గాజులతో అలంకరించనున్నట్లు తెలిపారు.



వేతన జీవుల వేదన



పెదకూరపాడు సామాజిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్న శానిటేషన్ వర్కర్లు

- ప్రభుత్వాస్పత్రిలో శానిటేషన్ సిబ్బంది అవస్థలు
- ఐదునెలలుగా రాని జీతాలు
- పట్టించుకోని కాంట్రాక్ట్ సంస్థ
- 11 నెలలుగా పీఎఫ్ పెండింగ్
- పూట గడవడం కష్టంగా మారిందని సిబ్బంది ఆవేదన

పెదకూరపాడు: పల్నాడు జిల్లాలో పెదకూరపాడు, అమరావతి, గురజాల, మాచర్ల, వినుకొండ, ఈపూరు, చిలకలూరిపేట మండల కేంద్రాల్లో సామాజిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఒక్కొక్క సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఏడుగురు శానిటేషన్ సిబ్బంది, ఏడుగురు సూపర్‌వైజరులు పనిచేస్తుంటారు. సత్తెనపల్లి, నరసరావుపేట, విజయపూరిసౌత్‌లలో ఏరియా వైద్యశాలలు ఉన్నాయి. వాటిలో 39 మంది శానిటేసన్ సిబ్బంది, ముగ్గురు సూపర్‌వైజర్లు పనిచేస్తున్నారు. వీరు ప్రతిరోజు వైద్యశాలను శుభ్రపరిచి, పారిశుద్ధ్య మెరుగదల పనులు ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, రెండు గంట నుంచి రాత్రి పది గంటల వరకు, రాత్రి 11 గంట నుండి ఉదయం 6 గంటల వరకు షిఫ్టులు వారీగా విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిని ఫస్ట్ అబ్జెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కింద విధులు నిర్వర్తిస్తున్నారు. వారికి నెలకు వర్కర్స్‌కు రూ.11,858, సూపర్‌వైజర్‌కు రూ.13,046, పీఎఫ్ రూ.1060 మాత్రమే ఇస్తారు. అదీ ఎప్పుడు ఇస్తారో తెలియని పరిస్థితి.

సకాలంలో అందని వేతనాలు

జిల్లా సీహెచ్‌సీ, పీహెచ్‌సీ వైద్యశాలల్లో పనిచేసే పారిశుద్ధ్య వర్కర్స్, సూపరవైజర్లకు గత మార్చి నెల నుంచి వేతనాలు రావడం లేదు. పీఎఫ్ అయితే 11 నెలలుగా బకాయి ఉన్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రెండు నెలలకు మించి బకాయిలు లేవని సిబ్బంది చెబుతున్నారు. తమ కుటుంబాలు పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. కాంట్రాక్టు సంస్థను అడిగితే మాకు 11 నెలలు నుండి బిల్లులు రావడం లేదని సమాధానం చెబుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పులతో రోజు గడవడం కష్టంగా మారిందన్నారు. కాంట్రాక్టు సంస్థను వివరాలు అడిగేదుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

వేతనాలు ఇచ్చి ఆదుకోవాలి.

షేక్ కరిమూన్, శానిటేషన్ వర్కర్, పెదకూరపాడు. ఐదు నెలలుగా మాకు జీతాలు రావడం లేదు. అప్పులు చేసి జీవనం సాగిస్తున్నాం. నిత్యం అపరిశుభ్ర ప్రాంతాలను శుభ్రం చేసి రాత్రి, పగలు పని చేస్తున్నాం. ఐదు నెలలు, ఆరు నెలలు వేతనాలు పెండింగ్ పెడితే కుటుంబాలను పోషించుకోవడం ఎలా? పెండింగ్ వేతనాలు, పీఎఫ్‌లు వెంటనే చెల్లించాలి.

ఎలా బతకాలి...



జీతాలు రాకపోతే ఎలా బతకాలి. పిల్లలు చదువు, ఇంటిలో పోషణ భారంగా మారింది. కాంట్రాక్టర్‌లు బిల్లులు కాలేదంటున్నారు. మా గోడు పట్టించుకోండి. నెల నెల జీతం ఇస్తే మా కుటుంబాలు బాగుంటాయి. వ్యాధులు ప్రబలకుండా రోగుల ఆరోగ్యం కాపాడే మాకు ఇలా వేతనాలు రాకపోవడం ఎంతో బాధాకరం.

– ఎస్.కిరణ్, శానిటేషన్ వర్కర్, పెదకూరపాడు.

ఒత్తిడి పెరుగుతుంది.

ఐదు నెలలుగా జీతాలు రావడం లేదు. పీఎఫ్ 11 నెలలు బకాయిలు ఉన్నాయి. వర్కర్ల నుంచి ఒత్తిడి పెరుగుతుంది. మాకు కుటుంబ పోషణ భారంగా ఉంది. సంస్థ వారిని అడిగితే వారికి బిల్లులు రావడం లేదంటున్నారు. ప్రభుత్వ పెద్దలు మా గోడు పట్టించుకుని జీతాల బకాయిలు తక్షణమే విడుదల చేయాలి.

– షంషుద్దీన్, సూపర్‌వైజర్

క్లుప్తంగా

టంగుటూరికి జిల్లా ఎస్పీ ఘన నివాళి



నరసరావుపేట: ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు టంగుటూరి చిత్రపటానికి పూలు చల్లి ఘనంగా నివాళులర్పించారు. అదనపు ఎస్పీ ఏఆర్ రామచంద్రరాజు, అదనపు ఎస్పీ క్రైమ్స్ సీహెచ్.లక్ష్మీపతి, ఎస్పీ సీఐ, ఆర్ఐ, ఇతర పోలీస్ అధికారులు పాల్గొని, ఆంధ్ర కేసరి చిత్రపటానికి నివాళులర్పించారు.

ఒకటిన సబ్ జూనియర్ ఖో-ఖో జట్ల ఎంపిక

నకరికల్లు: ఉమ్మడి గుంటూరు జిల్లా సబ్‌జూనియర్ ఖో-ఖో జట్ల ఎంపికలు నరసరావుపేట శంకరభారతీపురం ఉన్నత పాఠశాలలో సెప్టెంబర్ 1వ తేదీన నిర్వహించనున్నట్లు గుంటూరు జిల్లా ఖో-ఖో అసోసియేషన్ కార్యదర్శి చింతా పుల్లయ్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికైన జట్లు సెప్టెంబర్ నెలలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు. సెలక్షన్స్‌లో పాల్గొనదలచిన క్రీడాకారులు 2010 అక్టోబర్ 1వ తేదీలోపు పుట్టి ఉండాలన్నారు. వయస్సు, ఎత్తు, బరువు కలిపి మొత్తం 215 పాయింట్లకు మించి ఉంచకూడదని అన్నారు. సెలక్షన్స్‌లో పాల్గొనేందుకు ఒక్కో పాఠశాల నుంచి ముగ్గురు లేదా నలుగురు మాత్రమే పాల్గొనాలని అన్నారు. ఎంపికకు వచ్చే సమయంలో వయస్సు ధ్రువీకరణపత్రం వెంట తెచ్చుకోవాలని సూచించారు. వివరాలకు జి.ఝాన్సీ రాణి, ఫిజికల్ డైరెక్టర్, శంకరభారతీపురం, నరసరావుపేట, సెల్ 9949533234 నంబరులో సంప్రదించాలన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



నరసరావుపేటటౌన్: ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రైల్వే ఎస్ఐ తన్నీరు సుబ్బారావు తెలిపిన వివరాలు... సుమారు 45 సంవత్సరాల వయస్సు ఉన్న వ్యక్తి రైలు బోగీలో మృతి చెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడు నీలం రంగు నిండు చేతుల చొక్కా, బ్లూ కలర్ ఫ్యాంట్ ధరించి ఉన్నాడు. అనారోగ్యంతో మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసినవారు రైల్వే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

ఒంటరిగా డ్యూటీలు కేటాయించకూడదు



రాత్రి సమయంలో ఒంటరిగా మహిళా డాక్టర్లకు డ్యూటీలు కేటాయించవద్దు. కనీసం ఇద్దరు లేదా ముగ్గురు డాక్టర్లు వారికి తోడుగా ఉండే విధంగా చూడాలి. ఏకధాటిగా 36గంటల పాటు డ్యూటీలు చేయమనడం ఏమాత్రం తగదు. రాత్రి సమయంలో పోలీసులు, సెక్యూరిటీ గార్డుల పర్యవేక్షణ తప్పకుండా ఉండాలి. సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి అవి పనిచేస్తున్నాయో లేదో తప్పకుండా పరిశీలిస్తూ ఉండాలి.

–డాక్టర్ ఏపీవీ రామలింగారెడ్డి, ఐఎంఏ మాజీ అధ్యక్షులు, నరసరావుపేట



సాధారణ ఉద్యోగులుగానే డ్యూటీలు ఉండాలి



డాక్టర్లు కూడా మనుషులే. వారికి కూడా సాధారణ ఉద్యోగులుగానే ఎనిమిది గంటల పని దినం అమలు చేయాలి. ఒక్కొక్కరు 36గంటలు, 48గంటలు పనిచేస్తున్న సందర్భాలు ఉన్నాయి. ఆసుపత్రిలో ఎటువంటి సంఘటన జరిగినా మిగతా వారిని అప్రమత్తం చేసేందుకు అలారమ్ సిస్టమ్ ఉంటే బాగుంటుంది. పోలీసులు, ప్రైవేటు సెక్యూరిటీ, సీసీ కెమెరాలతో సెక్యూరిటీ ఏర్పాట్లు చాలా అవసరం.

–డాక్టర్ కె.జగన్‌మోహన్‌రెడ్డి, రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షులు, కొండవీడు ఈఎన్‌టీ హాస్పిటల్

వైభవంగా వీర్ల అంకాలమ్మ బోనాల ఉత్సవం



బోనాలతో అమ్మవారి గుడి చెంత భక్తులు



వీర్ల అంకాలమ్మ తల్లి

కారెంపూడి: పల్నాటి రణక్షేత్రంలో కారెంపూడిలో కొలువైన వీర్ల అంకాలమ్మకు నిర్వహించే బోనాల ఉత్సవం అరుదైంది. ఏ గ్రామంలోనైనా గ్రామ దేవతకు ఒక రోజు బోనాల ఉత్సవం నిర్వహిస్తారు. కానీ వీర్ల అంకాలమ్మకు శ్రావణమాసం మొత్తం బోనాల ఉత్సవాలను నిర్వహిస్తారు. ప్రతి గడప మదినిండుగా అంకాలమ్మను కొలుస్తారు. శుక్రవారం రాత్రి అమ్మవారి బోనాల ఉత్సవం వైభవంగా జరిగింది. పవిత్ర మాసంలో రణక్షేత్ర జనం మొత్తం అమ్మవారినే తలుస్తారు. తొలిరోజు అంకాలమ్మ అమ్మవారి విగ్రహాన్ని బయటకు తీస్తారు. పల్నాటి బ్రహ్మనాయుడు నృసింహకుంతం తోడుగా అమ్మవారు గ్రామంలో ప్రతి గడప వద్దకు వెళ్లి భక్తుల పూజలందుకుంటారు. దీంతో పాటు రెండు తెలుగు రాష్ట్రాలలో వేలాదిగా ఉన్న పల్నాటి వీరాచారవంతులు ఇలవేల్పు కూడా అంకాలమ్మ. అమ్మవారికి గుర్తుగా వారి ఇళ్లలో అంకమ్మ వీర బుట్టలుంటాయి. వీరే కాక ప్రతి నిత్యం అనేక మంది భక్తులు పల్నాటి అంకాలమ్మ ఆశీస్సులు పొందుతారు. క్రీ.శ 1070లో పల్నాటి అలరాజు మామ కొమ్మరాజు అమ్మవారిని రణక్షేత్రంలో ప్రతిష్ఠించినట్లు చారిత్రక ఆధారాలున్నాయి. తూర్పు అభిముఖంగా అమ్మవారు కొలువై ఉన్నారు. అక్కడ నుంచి నాగులేరు తీరంలో జరిగిన పల్నాటి యుద్ధాన్ని అమ్మవారు వీక్షించారని వీరుల మరణాలను చూచి అమ్మవారు కంటనీరు పెట్టుకున్నారని చారిత్రక గాథ. దానికి తగినట్లుగానే అమ్మవారి తల ఎడమవైపుకు వాల్చి కంట నీటితో ఉన్న దృశ్యమే మూలవిరాట్‌లో సాక్షాత్కరిస్తుంది. శ్రావణ మాసం మొత్తం అమ్మవారితో పాటు పోలేరమ్మ తల్లి, పాతపాటేశ్వరమ్మ అమ్మవార్లను కూడా గ్రామస్తులు కొలుస్తారు. కుంకుమ బండ్లు కట్టి ఆ బండ్ల వెంట ఉమ్మడిగా వచ్చి అమ్మవారికి బోనాల సమర్పించే కార్యక్రమం అత్యంతశోభాయమానంగా జరుగుతోంది. పల్నాటి చరిత్రతో ముడిపడిఉన్న చారిత్రక ప్రసిద్ధి చెందిన శక్తి దేవత అంకాలమ్మకు ఎన్నోళ్లుగా క్రమం తప్పక ఉత్సవాలు జరుగుతున్నాయి.



అమ్మవారి గుడి చెంత కుంకుమ బండ్లు,



శుక్రవారం గుడికి తరలుతున్న అమ్మవారి కుంకుమ బండి

రైలు కింద పడి వ్యక్తి మృతి

పిడుగురాళ్ల: గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. నడికుడి రైల్వే ఎస్ఐ శ్రీనివాసరావునాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. పిడుగురాళ్ల న్యూ రైల్వే స్టేషన్, పిడుగురాళ్ల రైల్వేస్టేషన్‌కు మధ్యలో కిలో మీటర్ రాయి 66/7–5 వద్ద గుర్తు తెలియని వ్యక్తి రైలు ఢీకొని మృతి చెంది ఉన్నాడని తెలిపారు. ఆ వ్యక్తి తెలుపు రంగు బారు చేతుల చొక్కా, తెలుపు రంగు లుంగీ ధరించి ఉన్నాడని అన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించామని తెలిపారు. వివరాలు తెలిసి ఉంటే 9440438256 నంబరుకు తెలియజేయాలని ఆయన కోరారు.

సీఎంఏ ఇంటర్ ఫలితాల్లో 'శ్రీమేధ' విజయకేతనం



గుంటూరు ఎడ్యుకేషన్: ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) శుక్రవారం ప్రకటించిన సీఎంఏ ఫైనల్ ఫలితాల్లో శ్రీమేధ విద్యాసంస్థల విద్యార్థులు అఖిల భారతస్థాయిలో టాప్ ర్యాంకులతో పాటు అత్యధిక ఉత్తీర్ణతా శాతాన్ని సాధించినట్లు సంస్థ చైర్మన్ అన్నా నందకిశోర్ తెలిపారు. గుంటూరు కొత్తపేటలోని క్యాంపస్‌లో జరిగిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీఎంఏ ఇంటర్ విభాగంలో షేక్ ఇర్ఫాన్ 800 మార్కులకు గాను 557 మార్కులతో అఖిల భారతస్థాయిలో 19వ ర్యాంకు, అన్నా ధీరజ్ 543 మార్కులతో 27వ ర్యాంకు, డి.లక్ష్మీ నరసింహ 460 మార్కులు, ఎన్.స్తుతి హర్షిత 448 మార్కులు, టి. రూపశ్రీ 439, టి. వరలక్ష్మి 436 మార్కులు సాధించారని తెలిపారు. ఇంటర్మీడియెట్ నుంచి సీఏ, సీఎంఏ కోర్సులకు అనుభవజ్ఞులైన అధ్యాపకులతో క్రమశిక్షణతో కూడిన శిక్షణ అందించడం ద్వారా తమ విద్యార్థులు అఖిల భారతస్థాయిలో టాప్ ర్యాంకులు కైవసం చేసుకున్నారని వివరించారు. గత 19 ఏళ్లుగా సీఏ, సీఎంఏ కోర్సుల్లో 450కు ఆల్ ఇండియా ర్యాంకులను సాధించినట్లు చెప్పారు. సీఎంఏ ఇంటర్ పూర్తయిన విద్యార్థులకు ఐసీఏఐ నెలకు రూ.25వేలు ఇంటర్న్‌షిప్ ఫీజుతో మంచి అవకాశాలు కల్పిస్తోందన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకుని, కామర్స్ ప్రొఫెషనల్‌గా ఎదగాలని సూచించారు. విద్యార్థులను శ్రీమేధ చైర్మన్ అన్నా నందకిశోర్, డైరెక్టర్ శ్రీలక్ష్మి అభినందించారు.

విజ్ఞాన్ వర్సిటీకి 'అబెట్' అక్రిడిటేషన్

చేబ్రోలు:వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీకి ప్రతిష్ఠాత్మక యూఎస్‌ఏ బేస్డ్ అబెట్ (అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ)అక్రిడిటేషన్ లభించిందని వైస్ చాన్స్‌లర్ కల్నల్ పి.నాగభూషణ్ శుక్రవారం తెలిపారు. వైస్ చాన్స్‌లర్ మాట్లాడుతూ దేశంలో కేవలం 12 యూనివర్సిటీలకు అబెట్ అక్రిడిటేషన్ ఉందని, అందులో విజ్ఞాన్ యూనివర్సిటీ కూడా ఒకటని పేర్కొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలలో అబెట్ అక్రిడిటేషన్‌ను సాధించిన మొట్టమొదటి యూనివర్సిటీగా విజ్ఞాన్ నిలిచిందని చెప్పారు. యూనివర్సిటీలోని ఐదు బ్రాంచ్‌లకు (సీఎస్ఈ, ఈఈఈ, ఈసీఈ, మెకానికల్, బయోటెక్నాలజీ) అబెట్ అక్రిడిటేషన్ ఆరు సంవత్సరాల పాటు లభించిందని వెల్లడించారు. అమెరికా నుంచి వచ్చిన 10 మంది సభ్యుల బృందం యూనివర్సిటీలో మూడు రోజుల పాటు తనిఖీ నిర్వహించి అక్రిడిటేషన్‌ను అందించిందని వివరించారు. ఐక్యూఏసీ సిబ్బందిని చైర్మన్ లావు రత్తయ్య అభినందించారు.

ఘరానా చైన్ స్నాచర్ అరెస్ట్

రూ.6.10 లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ స్రవంతిరాయ్, చిత్రంలో నిందితుడు (ముసుగులో)

విజయవాడస్పోర్ట్స్:విజయవాడ, నరసరావుపేటలో వరుస చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న నిందితుడు యన్నం సాయితేజరెడ్డిని అరెస్ట్ చేసినట్లు క్రైం ఏసీపీ స్రవంతిరాయ్ తెలిపారు. నిందితుడు నుంచి రూ.6.10 లక్షల విలువైన 87 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వన్‌టౌన్‌లోని సీసీఎస్ స్టేషన్ వద్ద ఈ కేసుకు సంబంధించిన వివరాలను మీడియాకు ఆమె శుక్రవారం వెల్లడించారు. పల్నాడు జిల్లా నరసరావుపేట సమీపంలోని లింగంగుంట్ల గ్రామానికి చెందిన సాయితేజరెడ్డి డిగ్రీ పూర్తి చేశాడని, మద్యం, ఆన్‌లైన్ బెట్టింగులకు అలవాలు పడి సులువుగా డబ్బు సంపాదించేందుకు చైన్‌స్నాచింగ్ మార్గాన్ని ఎంచుకున్నాడని చెప్పారు. మహిళల మెడలో బంగారు గొలుసులను తెంపేందుకు యమహా ఎఫ్‌జెడ్ వాహనాన్ని కొనుగోలు చేశాడని పేర్కొన్నారు. వాహనంపై హెల్మెట్ ధరించి రోడ్డుపై వెళ్లే మహిళల మెడలోని బంగారు గొలుసులను తెంచుకుని పరారయ్యేవాడని తెలిపారు. ఇటీవలే ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మాచవరం, పటమట పోలీస్ స్టేషన్‌ల పరిధిలో మూడు చైన్ స్నాచింగ్‌లకు పాల్పడ్డాడని, నరసరావుపేటలో ఒక చైన్ స్నాచింగ్ చేశాడని, విజయవాడలోని పలు ప్రాంతాల్లో నాలుగు చైన్ స్నాచింగ్‌లకు విఫలయత్నం చేశాడని వెల్లడించారు. దొంగిలించిన చైన్‌లను విక్రయించేందుకు విజయవాడ వచ్చిన సాయితేజరెడ్డిని రామలింగేశ్వరనగర్ వద్ద సీసీఎస్ సెంట్రల్ డివిజన్ సీఐ ఎస్.వి.వి.లక్ష్మీనారాయణ తన బృందంతో కలిసి అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బ్యాంకు సేవలు ప్రజలు ఉపయోగించుకోవాలి

- 25న నరసరావుపేటలో తొలి బ్రాంచ్ ప్రారంభం
- ది.విశాఖపట్నం కో-ఆపరేటీవ్ బ్యాంకు చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు



మాట్లాడుతున్న బ్యాంకు చైర్మన్ రాఘవేంద్రరావు

నరసరావుపేట: సామాన్యులు, మధ్య తరగతి ప్రజల ఆర్థిక భద్రతే లక్ష్యంగా ప్రజాశ్రేయస్సు కోసం కొన్నేళ్లుగా ది విశాఖపట్టణం కో-ఆపరేటీవ్ బ్యాంకు పనిచేస్తోందని ఆ బ్యాంకు చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని అరండల్‌పేటలో రిజర్వ్ బ్యాంకు అనుమతితో ఆదివారం ప్రారంభించనున్న పల్నాడు జిల్లా తొలి బ్యాంకు బ్రాంచ్ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే 51 బ్రాంచ్‌లు పనిచేస్తుండగా, ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా మరో నాలుగు జిల్లాల్లో బ్రాంచ్‌లు ఏర్పాటుచేయబోతున్నామన్నారు. బ్యాంకులో రూ.4,250కోట్ల డిపాజిట్లు, రూ.3302కోట్లు ఇచ్చిన రుణాలతో కార్యకలాపాలు నిర్వహిస్తుందన్నారు. మొత్తం 1,07,865 మంది సభ్యులు బ్యాంకులో డిపాజిటర్లుగా ఉంటూ రూ.350కోట్ల షేర్ ధనం కలిగి ఉందన్నారు. ఇప్పటికే బ్యాంకుకు 14 సొంత భవనాలు కలిగి ఉండగా మరో మూడు భవనాలు నిర్మాణ దశలో ఉన్నాయని చెప్పారు. సుమారు రూ.600 కోట్ల రిజర్వు నిధులు ఉన్నాయన్నారు. హైదరాబాదులో నాలుగు, గుంటూరులో నాలుగు, మంగళగిరిలో ఒక బ్రాంచ్ తొమ్మిదేళ్లుగా కార్యకలాపాలు చేస్తున్నాయన్నారు. దేశంలోని 1485 సహకార బ్యాంకుల్లో మొదటి 15 స్థానాల్లో విశాఖ బ్యాంకు ఉందన్నారు. పట్టణంలోని అరండల్‌పేటలో ఈనెల 25వ తేదీ ఆదివారం బ్యాంకు శాఖను మాజీ చైర్మన్ మానం ఆంజనేయులు ప్రారంభిస్తారన్నారు. డైరెక్టర్ చిన్నం కోటేశ్వరరావు, స్థానిక శాఖ మేనేజర్ బంగారు బాబు పాల్గొన్నారు.

తొలిదశలోనే గులాబీ రంగు పురుగులను నశింపచేయాలి

జిల్లా వ్యవసాయాధికారి మురళి



గ్రంథశిరిలో పత్తి పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మురళి

అచ్చంపేట: పత్తి పంటపై గులాబీ రంగు(పుచ్చ కాయ పురుగు)ఎక్కువగా ప్రభావం చూపుతుందని, దాన్ని తొలిదశలోనే నశింపజేయాలని జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి సూచించారు. మండలంలోని గ్రంథశిరిలో శుక్రవారం ఆయన పత్తి పంటను పరిశీలించారు. పూత, కాయదశలో ఉన్న పంటపై గులాబీ రంగు పురుగు ఉండటాన్ని ఆయన గుర్తించారు. పత్తిపంటలో ఎకరాలు 4 నుంచి 6 వరకు లింగార్షక బుట్టలు ఏర్పాటు చేసుకుని, పురుగు ఉధృతిని గమనించాలని అన్నారు. ప్రతి రోజూ ఎనిమిది పురుగుల కంటే ఎక్కువ ఉంటే పురుగుమందు పిచికారి చేసి నివారించుకోవాలన్నారు. పురుగు లేత దశలో ఉన్నప్పుడు, గుడ్డు దశను నివారించేందుకు వేపనూనె ఐదు మిల్లీలీటర్లు, లేక ప్రొఫెనోఫోస్ రెండు మిల్లీలీటర్లు లీటరు నీటిలో కలిపి మొక్కలు పూర్తిగా తడిచే వరకు పిచికారి చేయాలన్నారు. వేప గింజల కషాయాన్ని ఎలా తయారు చేసుకోవాలో వివరించారు. సేకరించుకున్న వేప గింజలను బాగా ఎండబెట్టి పొడి చేసి 500 గ్రాముల పొడిని 10 లీటర్ల నీటిలో కలిపి ఒక రాత్రంతా నానబెట్టి తరువాత రోజు ఆ ద్రావణానికి 200 గ్రాముముల సబ్బు పొడి కలిపుకోవాలన్నారు. ఆలా తయారు చేసుకున్న ద్రావణాన్ని 200 లీటర్లలో కలిపి ఎకరాకు పత్తి పంటపై పిచికారి చేయాలన్నారు. వేప గింజల కషాయం పిచికారి వలన అన్ని రకాల రసం పీల్చే పురుగులను నివారించుకోవచ్చని అన్నారు. రెక్కల పురుగులు మొక్క మీద గుడ్డు పెట్టకుండా ఉండేందుకు వేప గింజల కషాయం బాగా పనిచేస్తున్నందన్నారు. దీనివల్ల పర్యావరణానికి ఎలాంటి హాని జరగదన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు వి.హనుమంతరావు, వ్యవసాయాధికారి పి.వెంకటేశ్వర్లు, వ్యవసాయ సిబ్బంది హర్ష, పవన్, మున్వర్, రైతులు పాల్గొన్నారు.

ఉద్యోగానికి రాజీనామా చేయాలంటూ వేధింపులు

అంగన్‌వాడీ కార్యకర్త ఆవేదన

బెల్లంకొండ: అధికార మదంతో టీడీపీ నాయకులు చిరు ఉద్యోగులను వేధింపులకు గురిచేస్తున్నారు. ఉద్యోగానికి చేయాలంటూ ఓ అంగన్‌వాడీ కార్యకర్తను ఒత్తిడి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మండలంలోని మన్నెసుల్తాన్‌పాలెం ఎస్సీ అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త మాటూరి బుజ్జి శుక్రవారం పత్రికా ప్రకటన విడుదల చేసింది. తాను 15 ఏళ్లుగా పనిచేస్తున్నానని, 2016లో ఉత్తమ కార్యకర్తగా జిల్లా కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రం అందుకున్నట్లు తెలిపింది. నా భర్త వైఎస్సార్ సీపీలో పనిచేస్తున్నాడనే కారణంతో కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి టీడీపీ నాయకులు వేధింపులకు గురి చేస్తున్నారని తెలిపింది. కేవలం తనను తొలగించి, వారికి అనుకూలంగా ఉండే వారిని ఉద్యోగంలో నియమించుకోవాలని భావించి తాను సరిగా పనిచేయడం లేదంటూ ఈనెల 19న తనపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారని తెలిపింది. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విచారణకు రాగా తాము చెప్పింది రాసుకోమని, మంచిగా తనను రాజీనామా చేస్తే చేయమనండి, లేకుంటే ప్రతిసారి మేము ఇలాగే ఫిర్యాదు చేస్తామని టీడీపీ నాయకులు అంటున్నారంటూ ఆవేదన వ్యక్తం చేసింది. తమపై రాజకీయ వేధింపులు ఆపాలని కోరింది.

పటిష్ట రక్షణతో పరిశ్రమలను నిర్వహించాలి

అధికారుల సమావేశంలో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: జిల్లాలో ప్రమాదకర కేటగిరిల్లోని పరిశ్రమల్లో ప్రమాదాల్ని నివారించేందుకు యాజమాన్యాలు పటిష్ట రక్షణ ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, తెలిపారు. కలెక్టరేట్‌లోని వీడియో సమావేశంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలోని పరిశ్రమల్లో సంబంధిత శాఖలు తనిఖీలు నిర్వహించి నివేదిక అందించాలని ఆదేశించారు. ముఖ్యంగా ప్రమాద నివారణ ఏర్పాట్లలో రాజీ ఉండదని స్పష్టం చేశారు. నూతనంగా ఏర్పాటు చేస్తున్న పరిశ్రమలకు సింగిల్ డెస్క్ విధానంలో సత్వరమే విద్యుత్ కనెక్షన్లు అందించాలని చెప్పారు. పరిశ్రమల స్థాపనకు వచ్చే దరఖాస్తుల్ని పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు రవాణా వాహనాలకే కాకుండా, వస్తు ఉత్పత్తి యూనిట్లకు రుణాలిచ్చేలా బ్యాంకులు చర్యలు తీసుకోవాలన్నారు. వారిని ప్రోత్సహించేందుకు ప్రత్యేకంగా డీపీఆర్ ప్రజంటేషన్ కార్యక్రమం నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో 24 ఎంఎస్ఎంఈలకు పెట్టుబడి సబ్సిడీ, వడ్డీ రీఎంబర్స్‌మెంట్ సబ్సిడీ, పవర్ బిల్ సబ్సిడీకి సంబంధించి రూ.1.77 కోట్లు మంజూరు చేస్తూ కమిటీ తీర్మానించింది. సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం ఆర్.వెంకట్రావు, సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూదనరావు, లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్‌రెడ్డి, చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శివకుమార్ రెడ్డి, పరిశ్రమల యజమానులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లను అడ్డుకునేలా దారికి గండి



పెసర్లంక అరవింద వారధి వద్ద నదిలోకి ట్రాక్టర్లు దిగకుండా గండి కొడుతున్న దృశ్యం

కొల్లూరు: ఇసుక అక్రమ రవాణాదారుల ఆగడాలు అధికమవడంతో ప్రభుత్వ యంత్రాంగం వారిని అడ్డుకోవడానికి చర్యలు చేపట్టింది. మండలంలోని పెసర్లంక అరవింద వారధి ఎగువ ప్రాంతంలోని పంట పొలాల వద్ద ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. బుధవారం అర్ధరాత్రి నిఘా బృందాలు ప్రయత్నించినప్పటికీ ట్రాక్టర్లు సహా అక్రమార్కులు పరారయ్యారు. బృందాల కదలికలపై వారే నిఘా పెట్టి ఏ కాస్త సమయం దొరికినా ట్రాక్టర్లలో ఇసుక భారీగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. గురువారం రాత్రి కూడా పెసర్లంక అరవింద వారధి ఎగువ ప్రాంతంలో తవ్వకాలు చేపట్టి ఇలా తరలించారు. సిబ్బంది వెళ్లేసరికి అప్రమత్తమయ్యారు. ట్రాక్టర్‌లో ఉన్న ఇసుక అన్‌లోడ్ చేయించి వెనక్కు పంపారు. అధికారులు వచ్చేశాక మరికొన్ని ట్రాక్టర్లు నదిలో ఇసుక తరలించేందుకు బయలుదేరాయి. అప్రమత్తమైన అధికారులు నదిలోకి అవి దిగకుండా దారికి పొక్లయినర్‌తో గండి కొట్టించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం పెసర్లంక వద్ద వేమూరు సెబ్ ఎస్ఐ గంగాధర్, డిప్యూటీ తహసీల్దార్ నిరంజన్, మైనింగ్ శాఖాధికారులు పరిస్థితిని పరిశీలించారు.